# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 10-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- పార్లమెంటులో సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.
- "బ్యాంకర్ల పుస్తకాల సాక్ష్య బిల్లు-2026"కు రాజ్యసభ ఈరోజు ఆమోదం తెలిపింది.
- స్వతంత్ర ఏకరీతి ట్రిబ్యునల్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి బిల్లును తీసుకువచ్చామని కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ అన్నారు.
- భారతదేశ బయోటెక్నాలజీ ఎకో సిస్టమ్‌లో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని పెంచాలని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు.

========================

పార్లమెంటులో సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ప్రతిపక్షాలు లెవనెత్తే ప్రతి అంశానికి స్పందించేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించవద్దని ఆయన ప్రతిపక్షాలను కోరారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం అనంతరం పార్లమెంట్ ప్రాంగణంలో విలేకరులతో కిరణ్ రిజిజు ఈరోజు మాట్లాడుతూ... విద్యార్థుల నిరసనలపై కేంద్రమంత్రి అమిత్ షా ఒక ప్రకటన చేసేందుకు వీలుగా సభ సజావుగా పని చేసేందుకు అనుమతించాలని విపక్షాలకు విజ్ఞప్తి చేశారు. పార్లమెంటరీ చర్చలకు కేంద్ర ప్రభుత్వం ఎన్నడూ వెనుకాడలేదని ఆయన ఈ సందర్భంగా వెల్లడిస్తూ..

(వాయిస్ 23 సెకన్లు)

========================

“బ్యాంకర్ల పుస్తకాల సాక్ష్య బిల్లు-2026”కు రాజ్యసభ ఈరోజు ఆమోదం తెలిపింది. లోక్‌సభ ఇప్పటికే ఈ బిల్లును ఆమోదించింది. ప్రస్తుత బ్యాంకింగ్ వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా చట్టపరమైన వ్యవస్థను ఆధునీకరించడమే లక్ష్యంగా ఉన్న ఈ బిల్లును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. బ్యాంకర్ల పుస్తకాలకు సంబంధించిన సాక్ష్యాల విషయంలో ఒక చట్టాన్ని తీసుకురావడం, దానిని సమకాలీన డిజిటల్ బ్యాంకింగ్ పద్ధతులకు అనుగుణంగా మార్చడం ఈ బిల్లు లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ బిల్లు ఒక గొప్ప సంస్కరణాత్మక చర్య అని కేంద్రమంత్రి అన్నారు. ఇది దేశాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లడంలో సహాయపడుతుందని తెలిపారు. నేడు.. భారతదేశం తన ఆర్థిక వ్యవస్థను డిజిటలైజ్ చేయడంలో అద్భుతమైన పురోగతిని సాధించిందని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ బయోటెక్నాలజీ ఎకో సిస్టమ్‌లో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని పెంచాలని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్ సీనియర్ అధికారులతో ఈరోజు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బయోటెక్నాలజీ లైఫ్ సైన్సెస్ రంగాలలో స్వదేశీ ఉత్పత్తులు, సాంకేతికతలను ప్రోత్సహించేందుకు, పరిశ్రమల విస్తరణను బలోపేతం చేసేందుకు ప్రైవేట్ భాగస్వామ్యం అవసరమన్నారు. ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధి నుండి వాణిజ్యీకరణ దశకు వేగంగా చేరుకోవడానికి, భారతదేశ స్వదేశీ బయోటెక్నాలజీ సామర్థ్యాలు, పరిశ్రమ పెట్టుబడిదారుల మధ్య బలమైన సంబంధాలను నిర్మించాల్సిన అవసరం ఉందని జితేంద్ర సింగ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత దశాబ్దంలో ప్రభుత్వ ఇ-మార్కెట్ ప్లేస్ (GeM) స్థూల వాణిజ్య విలువ 422 కోట్ల రూపాయల నుండి లక్షా 55 వేల కోట్ల రూపాయలకు పైగా పెరిగిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ పోర్టల్‌లో 12 లక్షలకు పైగా MSMEలు, వాటిలో 2 లక్షలకు పైగా మహిళల నేతృత్వంలో ఉన్నాయని, అలాగే 42 వేల పైగా అంకుర సంస్థలు నమోదయ్యాయని సామాజిక మాధ్యమం పోస్టులో ఆయన ఈరోజు పేర్కొన్నారు. గత పదేళ్లలో ఈ ప్లాట్‌ఫామ్ పోటీని పెంచిందని, ధరల నిర్ధారణను మెరుగుపరిచిందని కేంద్రమంత్రి చెప్పారు. `వోకల్ ఫర్ లోకల్`, `మేక్ ఇన్ ఇండియా` దార్శనికతను ప్రోత్సహిస్తూనే... ఈ ప్లాట్‌ఫామ్ ప్రభుత్వ మార్కెట్లను MSMEలు, స్టార్టప్‌లు, మహిళా పారిశ్రామికవేత్తలకు మరింత అందుబాటులోకి తెచ్చిందని పీయూష్ గోయల్ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

“హర్ ఘర్ తిరంగ” ఉద్యమంలో దేశ ప్రజలు ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు. `వికసిత్ భారత్` నిర్మాణానికి తమ సమిష్టి సంకల్పాన్ని తెలియచేయాలని పిలుపునిచ్చారు. దేశానికి త్రివర్ణ పతాకం గర్వకారణమని సామాజిక మాధ్యమంలో నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ సంవత్సరం ‘వందేమాతరం’ గేయం 150వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని ప్రధానమంత్రి అన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

`ట్రిబ్యునల్స్ సంస్కరణల బిల్లు-2026ను లోక్‌సభ ఈరోజు ఆమోదించింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్య ఈ బిల్లు ఎటువంటి చర్చ లేకుండానే ఆమోదం పొందింది. ఉదయం లోక్ సభ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ పలు మార్లు వాయిదా పడింది. మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు.. ప్రతిపక్షాల ఆందోళనల మధ్యనే కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ట్రిబ్యునల్స్ సంస్కరణల బిల్లు-2026ను ప్రవేశపెట్టారు. ఈ

సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ట్రిబ్యునల్స్ సంస్కరణల బిల్లు ఉద్దేశ్యం కోర్టుల స్థానాన్ని భర్తీ చేయడం కాదని, ఆధునిక పాలనలో వాటికి అనుబంధ సంస్థలుగా పని చేయడమేనన్నారు. స్వతంత్ర ఏకరీతి ట్రిబ్యునల్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ఈ బిల్లును తీసుకువచ్చామని తెలిపారు. పాలన, నియామకాలు, సంస్థాగత స్వాతంత్ర్యం, పారదర్శకత సామర్థ్యాన్ని బలోపేతం చేయడమే ఈ బిల్లు లక్ష్యమని మేఘ్వాల్ వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తమ ఆదాయాన్ని పెంచుకునే దిశగా భారతీయ నేత కార్మికులు, రూపకర్తలు వ్యవహరించాలని కేంద్ర జౌళి శాఖ కార్యదర్శి నీలం షామీ రావు అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన "జాతీయ చేనేత డిజైనర్ల సదస్సు" ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చేనేత రంగంలో డిజైన్‌కు కీలక పాత్ర ఉందని పేర్కొన్నారు. ఉత్పత్తుల డిజైన్లను మెరుగుపరచడం ద్వారా నేత కార్మికులు తమ అమ్మకాలను పెంచుకోవచ్చని సూచించారు. చేనేత రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న దేశవ్యాప్త నేత కార్మికులు, రూపకర్తలను ఆమె ఈ సందర్భంగా అభినందించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ సంవత్సరం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జాతీయ గేయం `వందేమాతరం` 150 ఏళ్ల ఉత్సవాలతో పాటు... 2047 నాటికి `వికసిత్ భారత్` నిర్మాణంలో యువశక్తి కృషిని ప్రముఖంగా చాటి చెప్పనున్నాయి. న్యూఢిల్లీలో పాత్రికేయులతో ఈరోజు రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ... ఈ సంవత్సరం వేడుకల్లో వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాలు ఒక ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని చెప్పారు. ఎర్ర కోటపై నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగం చేసిన అనంతరం.. ఎన్‌సిసి క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు జాతీయ గీతాన్ని ఆలపిస్తారని తెలిపారు. ఈసారి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎంఐ-17 హెలికాప్టర్లు పాల్గొంటాయని రాజేష్ కుమార్ సింగ్ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పు రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ పశ్చిమ మధ్యప్రదేశ్‌లలో ఈ రోజు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) ఆరెంజ్ అలెర్ట్ హెచ్చరిక జారీ చేసింది. రేపటి వరకు హర్యానా, చండీఘర్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, బీహార్, విదర్భ, మేఘాలయ, అస్సోంలలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. జమ్మూ-కాశ్మీర్, జార్ఖండ్, కర్ణాటక, కేరళం, మాహే, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌లలో మరో 24 గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కొనసాగుతాయని ఐఎండీ తెలిపింది. రానున్న రెండు రోజులలో ఒడిశా, పుదుచ్చేరి, రాయలసీమ, తెలంగాణ, గుజరాత్, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, లక్షద్వీప్ అండమాన్ నికోబార్ దీవులలో కూడా ఇలాంటి వాతావరణ పరిస్థితులే ఉండే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 78 వేల 499 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 43 పాయింట్ల లాభంతో 78 వేల 542 వద్ద ముగిసింది. నిఫ్టీ 13 పాయింట్లు లాభపడి 24 వేల 583 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95 రూపాయల 31 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 84.33 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 4 వేల 340 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =